# నరమేధం

ఛత్ర చామరాలతో అందంగా అలంకరించిన రథ ముఖ ద్వారం, మామిడాకుల తోరణాల తోనూ, సంప్రదాయ చిహ్నాలైన ఇత్తడి సెమ్మాలతోనూ, అతి కళాత్మకంగా కొబ్బరాకులతో అల్లిన పచ్చటి పూజా మంటపం, రంగు రంగుల పట్టుబట్టలతో చుట్టి అలంకరించిన రథ గోపురం, రథం అగ్రభాగాన పరుగులు తీస్తున్న శ్వేతాశ్వాలు, సారథ్యం చేస్తున్న కిరీటి విగ్రహం; నేత్రానందకరంగా ఉన్నాయి.

ఉత్తర దిశగా గూడుకట్టిన మేఘాలు ఉరుముతున్నాయి. క్రమ క్రమంగా అపరాహ్ణం దాటిన తరువాత, విస్తరించుకుంటున్న ఆషాఢ మేఘాల పరిష్వంగం మాటున సూర్యుడు మరుగుపడి పోతు న్నాడు. జనం గుంపులు గుంపులుగా వస్తున్నారు. జాతరని చూడ్డానికి.

విగ్రహాన్ని రథారోహణ చేశారు.

గంగరాజు సిల్కు లాల్చీ తొడుక్కుని పట్టుపంచ కట్టుకున్నాడు. బొద్దు మీసాలతో, సన్నంగా, పొడవుగా, తెల్లగా, వెండి తీగెలా వున్నాడు. రథం ముందు నిల్చొని రథ యాత్రా కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నాడు.

''టైమయింది, కానీయండి; గంగరాజుగారూ!'' అని ప్రక్కనున్న పూజారి మంత్రజలం చల్లి మంగళవచనాలు ఉచ్చరిస్తూ గంగరాజు మెడలో పూలదండ వేసి కొబ్బరికాయ చేతికి అందించేడు. రాజు క్షణం సేపు కళ్ళు మూసుకుని భగవంతుణ్ణి లోలోన ధ్యానించుకుంటూ''జై జగన్నాధ్!'' అని టెంకాయని మూడుసార్లు దిష్టితీసి బలం పూర్తిగా కొట్టేడు . కాయ తునాతునకలయి పోయింది. కుర్రాళ్ళు కొబ్బరి ముక్కల కోసం ఒకర్నొకరు తోసుకుంటూ ఎగబడిపోతున్నారు.

''జై జగన్నాథ మహా ప్రభూకీ జై'' '' జై, గంగరాజు బాబుకీ జై !'' అని జనంలోంచి హర్ష ధ్వానాలు మిన్నుముట్టేయి.

జగన్నాథుని రథం బయలుదేరింది.

లాంఛన ప్రాయంగా రాజు రథానికి కట్టిన తాడుని కొంత దూరం లాగి వదిలేశాడు. జనంరథాన్ని తోసుకుంటూ తాళ్ళతో లాక్కుంటూ బయలుదేరారు.

జేగంటలు మ్రోగుతున్నాయి. రథం మీద నుంచి ఏనుగులు ఘీంకరించినట్టు వీరకాలీలని ఊదుతున్నారు. రథంముందు, రోడ్డు మీద సంకీర్తనమేళం వాళ్ళు మృదంగాల్ని వాయించుకుంటూ లయబద్ధంగా ఎగురుతూ నాట్యం చేస్తున్నారు.

నీలమాధవుడు జగన్నాథ రూపంలో బలరామదేవునితోనూ, అనుంగు చెల్లెలు సుభద్రా దేవి తోనూ విజయుని సారథ్యంలో రథారూఢుడై ఊరేగుతున్నాడు. సమస్త కులాల వారికి తన దర్శన భాగ్యం కలగజేయటానికి ప్రతి ఏటా ఆషాఢ మాసంలో పతిత పావనుడు, తన నిజమందిరాన్ని విడిచి పెట్టి విడిది మందిరం ''గుడిసెన్న గుడికి'' రథయాత్ర సాగిస్తాడు. గుడిసెన్న గుడిలో ప్రతి యుగం లోనూ దివి నుంచి భువికి ఆర్తత్రాణ పరాయణుడై దుష్టశిక్షణార్థం వివిధ రూపాలతో అవతరించిన జగన్నాధుని అవతారాలను తొమ్మిది రోజులూ కన్నుల పండువుగా ప్రదర్శిస్తారు. అక్కడ భక్తుల

పూజలతోనూ, నైవేద్యాలతోనూ, స్తోత్ర పాఠాలతోనూ, రంగ రంగ వైభవంగా సంబరం జరుపు కుంటూ నిజసతినే మరచి భక్తుల బందీ అవుతాడు. పదవ రోజున చరాలున జ్ఞప్తికి వచ్చిన దేవేరి అలక తీర్చడానికి మలి రథయాత్ర సాగిస్తాడు.

రథయాత్రని, మలిరథయాత్రని నిర్వహించే అధికారం, ధర్మకర్తృత్వం వంశ పారంపర్యంగా గంగరాజుకి సంక్రమించింది. ఆ అధికారాన్ని సవాల్ చేస్తూ ఆ ఊరిలో మరో పేరెన్నికగన్న ప్రత్యర్థి వెంకునాయుడు గంగరాజుమీద కోర్టులో కేసు పెట్టేడు. అందువల్ల గత రెండేళ్ళుగా రథయాత్ర జరక్కుండా కోర్టు నుంచి ఇంజంక్షన్ ఆర్డరు తెప్పించి ఆపుచేస్తూ వచ్చాడు. చివరికి గంగరాజే దావాలో గెలిచాడు. తిరిగి గుడిసెన్న గుడికి ధర్మకర్త గంగరాజే అయ్యాడు. రథయాత్రకి కావలసిన చందాల్ని వసూలు చేయడం, యాత్ర ఏర్పాట్లు, గుడిసెన్న గుడిలో వున్నన్నాళ్ళూ భగవంతుడికి భోగరాగాలు అన్నీ స్వయంగా గంగరాజే చూసుకుంటున్నాడు. కోర్టులో గెలిచిన విజయోత్సాహం తోనూ, వెంకునాయుడి మీద కసితోను ఈ సంవత్సరం నాలుగైదు వేలు తన జేబులోంచే ఖర్చు పెడుతున్నాడు. ''నేను బ్రతికుండగా నా దేవుణ్ణి తక్కువ చేస్తానా'' అంటూ దేవుణ్ణి స్వంతం చేసుకుంటూ ఆ నవరాత్రులు రక రకాల భోగరాగాలతోనూ, షడ్రసోపేతమైన నైవేద్యాలతోనూ జగన్నాథుణ్ణి కొలవడానికి పూనుకున్నాడు. ఈ సంవత్సరం యాత్రని మరీ వైభవంగా చేస్తున్నాడు. ఎలక్షన్లు అతి దగ్గర్లో వున్నాయి. అందులో గంగరాజూ, వెంకునాయుడు ఇద్దరూ తలపడుతున్నారు. పుణ్యం, పురుషార్థం కోసం డబ్బు వెదజల్లుతున్నాడు.

జగన్నాథ రథచక్రాలు క్రీచుక్రీచు మంటూ బరువుగా కదులుతున్నాయి. రథం మీద పూజారులు జనం అందిస్తున్న కొబ్బరి కాయల్ని కొడుతున్నారు. పూలమాలల్ని విగ్రహాల పాదాల దగ్గరికి విసురుతున్నారు. హారతుల్ని వెలిగించి గంట వాయించుకుంటూ ఒక చుట్టు తిప్పి క్షణం సేపు కొబ్బరి చెక్కల్ని దేవుడికి చూపిస్తూ ''పుచ్చేసుకో'' అన్నట్లు తాళి చరిచి సగం చెక్కని బుట్ట లోకి, సగం కాలిన కర్పూరాన్ని తపేళాలోకి పడేసి మిగతాచెక్కలో తులసిదళం పడేసి భక్తులకిచ్చేస్తు న్నారు. పళ్ళెంలో దక్షిణలు ఖంగు ఖంగుమని ఎడతెరిపిలేకుండా పడుతున్నాయి. పూజారుల శరీరం నుండి చెమటలు కొబ్బరి నీటితో కలిసి రథం సందుల్లోంచి సన్నటి ధారలుగా కారుతున్నాయి. కుర్రాళ్ళు రథాన్ని తోస్తూ తోస్తూ మెల్లిగా రథం క్రింది భాగంలోకి ఎక్కిపోయి సందుల్లోంచి కారు తున్న కొబ్బరి నీటిని తనివితీరా తాగుతున్నారు.

బాజా భజంత్రీల మధ్యలో గుర్రాల,ఏనుగుల బుట్టబొమ్మలు తలల్ని ఆడించుకుంటూ వెనక్కీ, ముందుకీ అడుగులేసుకుంటూ ఆడుతున్నాయి.

సాయంత్రం అవుతున్న కొద్దీ చుట్టు పక్కల పల్లెటూళ్ళ నుంచి జనం పొలాల్లో ఊడుపుల పనులు పూర్తిచేసుకుని తండోప తండాలుగా వచ్చి చేరుతున్నారు. రోడ్డు కిరుప్రక్కలా మిఠాయి దుకాణా లకీ, బండి దుకాణాలకి బేరం మంచి రద్దీగా వుంది.

గంగరాజు తన అనుచరులతో రథం ముందు నడుస్తూ రథాన్ని ఎక్కడ ఆపాలో, ఎప్పుడు కదిలిం చాలో హుందాగా చేతి సౌంజ్ఞలతో ఆదేశిస్తున్నాడు. సంబరం మధ్యలో గంగరాజుక్కూడా మిత్రులు, శ్రేయోభిలాషులు మెడలో పూలదండలు వేసి నమస్కరిస్తున్నారు. కృతజ్ఞతాపూర్వకంగా వాళ్ళు జోడించిన చేతుల్ని తన రెండు చేతుల్తో పట్టుకుని కళ్ళకి అద్దుకుంటున్నాడు. మరికొందర్ని

కౌగిలించుకుంటున్నాడు. ఈ సంవత్సరం మరీ వైభవంగా జాతర జరిపిస్తున్నారు అని ఎవరైనా అంటే ''వెర్రోడా నేనెవడిని. అంతా పెద్దకళ్ళువాడి దయ!'' అని మీసాల్ని చేత్తో దువ్వుకుంటూ అంటున్నాడు. జగన్నాథుణ్ణి ''పెద్దకళ్ళువాడు'' అని ముద్దుగా పిలవటం ఆయనకి సరదా అనడం కంటె ఒక విధమైన స్టైయిల్ అంటే బాగుంటుంది. దూరంగా యెవరైనా పరిచయస్తుడు కనిపిస్తే గబ గబ అంగలేసు కుంటూ వెళ్ళి ''ఎక్కడికి జారుకుంటున్నావ్. ఇది నా యింట్లో పెళ్ళా? మీ అందరిదీను. దేవుడి కార్యం. రా, రా!'' అని వాడి కమీజునో, మెడకండువానో పట్టుకుని చిరుకోపం నటిస్తూ జనం మధ్య లోకి ఈడ్చుకువస్తున్నాడు. అది చూసి ప్రక్కవాళ్ళు నవ్వుతూంటే మహదానందం పొందుతున్నాడు. మధ్య మధ్య రథం యెక్కి చీమలబారుల్లా ముందుకు నడుస్తున్న జనాన్ని, యిరు పక్కల డాబాల మీద నుంచి ఇంటికప్పుల మీద నుంచి జాత్రని చూస్తున్న జనాన్ని చూస్తూ గర్వపడుతున్నాడు.

''గంగరాజు బాబూ, మనం కాస్త జాగ్రత్తగా వుండాలి. ఎగస్పార్టీవోళ్ళు మనలో కలిసే తిరుగుతున్నారు. అటు చూడండి. చూశారా అదే ఆ గళ్ళ చొక్కావోడు. ఆడు ఈ మధ్యనే ఎంకునాయుడు పటాలంలో చేరాడు. పట్నం నుంచి తెప్పించేడట ఎలక్షన్లకి ఎంకునాయుడు''.

''ఒరే, సాంబా! కొండంత మనిషివి నువ్వుండగా, అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు జగన్నాథుడు మన పార్టీ అయి వుండగా ఎంకునాయుడు ఎవడ్రా? ఝాటాగాడు!''

''తగవుకి దిగితే తలతీసేస్తాను. గాని, రాజుబాబు, రెండు రోజుల్నించి ఎంకునాయుడు ఇటు ఢిల్లీకి అటు హైదరాబాదుకి తెగఫోన్లు కొడుతున్నాడట. రెండు మూడు రోజుల్లో ఎవడో నాయకుణ్ణి తెప్పించి ఎలక్షన్ మీటింగు పెడతాడట.''

''పెట్టనీరా, నాయనా! జనం బఠానీలు నవులుతూ వింటారు. తరువాత ఇళ్ళకి పోతారు. ఆ వచ్చినవాడు మర్నాడు విమానం ఎక్కేస్తాడు. ఒరే, ఇది చాలా సంవత్సరాల నుంచి చూస్తున్నాం. నాయకుల మాటలు నమ్మి ఓటేసిన వాడెవడ్రా? హరికథలు విని పాపాలు చెయ్యడం మానేస్తున్నార్రా? మనం కూడా మలి రథా యాత్రనాడు అన్న సంతర్పణ చేయిస్తున్నాం. ముష్టివాళ్ళకు కాదు. ఊరు ఊరంతా రావాలి. అది సాక్షాత్తు జగన్నాథ ప్రసాదం. పూరీ నుంచి జగన్నాథ ప్రసాదాన్ని కుండల్లో తెప్పించి అందులో కలిపాం అందాం. అన్నదానంతో పాటు వస్త్ర దానం కూడాను. మరో రెండు వేలు ఖర్చు అవనీ. జగన్నాథ ప్రసాదం తిని, మనం పెట్టిన కొత్తబట్టలు కట్టుకుని పోలింగునాడు ఓటు వెయ్యమందాం; కాదు, ప్రార్థిద్దాం. అన్న ప్రసాదం అందులోనూ జగన్నాథ ప్రసాదం తిని మోసం చేస్తే కళ్ళు పోవూ? దేవుడా, తమాషానా? చచ్చినట్లు వేస్తారు. జగన్నాథ ప్రసాదం పెట్టిన వాడికి ద్రోహం తలపెడితే ఆ పరంధాముడు ఆ పాపాత్ముల్ని ఎలాంటి చిత్ర విచిత్రమైన రోగాలకి గురిచేస్తాడో - కుష్ఠు, క్యాన్సర్, పక్షవాతం లాంటి రోగాలతో భూమ్మీదే వాళ్ళు ఎలాంటి రౌరవాది నరకాల్ని అనుభవిస్తారో హరికథ రూపంలో మన పూజారి పెద్దకొడుకు వాళ్ళ నరనరానికీ ఎక్కించేస్తాడు. దాంతో హడలెత్తిపోయి చచ్చినట్టు ఓట్లు వేస్తారు.

''పూజారికి పెద్ద కొడుకున్నా డేమిటి?''

''ఆడు చిన్నప్పుడే గొప్ప మెకానిక్‌గా తయారయాడంట. వాడి బాబు పెట్టెకి వేసిన తాళం తాళంలాగే వుండేది. లోపలి డబ్బులు మాయం అయిపోయేవి. వాడితో పడలేక పట్నంలో

సంస్కృతం స్కూల్లో జాయిన్ చేశాడు. అక్కడ హరికథలు కూడా నేర్చుకున్నాట్ట. అదుగో రథం మీద గుర్రం ప్రక్కన కూర్చున్నాడు!''

''ఆ గుంటడా? ఆడికి కొంచెం మదపిచ్చి ఉన్నట్టుంది. ఆడోళ్ళ దగ్గర కొబ్బరికాయ లందుకుంటూ ఆళ్ళ రవికల్లోకి తొంగి చూస్తున్నాడు..'' అంటూ చెబుతున్న సాంబడు వెనకాల రథం దగ్గర గోలగా వుంటే అక్కడికి పరుగున వెళ్ళేడు.

''తొయ్యండ్రా.. ఆ! తొయ్యండెహె!.. ఇంకా.. జోర్.. జోర్సే! అటు లాగండి. ఆం. రాయి అడ్డం పెట్టు! అని జనం ఊపిరి బిగదన్ని రథాన్ని తోస్తున్నారు. రథ చక్రాలు క్రీచుక్రీచుమంటూ నేలని రాసుకుంటూ కదలడం లేదు. పూజారులు క్రిందికి దిగి, హడావుడిగా రథం చుట్టూ తిరుగుతూ, తోస్తున్న వాళ్ళకి సూచన్లు యిస్తున్నారు. జనంలోంచి మరికొందరు చేతులు కలిపారు. చెమట్లు కక్కుకుంటూ తొయ్యలేక జనం గింజాకుంటున్నారు.

సాంబడు రథం క్రింది భాగంలోకి దూరాడు. అప్పటికే వడ్రంగి యిరుసుల్ని చక్రానికి అమర్చిన యినప చట్రాల్ని సుత్తితో కొడుతూ సరిచేస్తున్నాడు. ''చక్రాల సందులో ఆవదం పొయ్యకపోతే యెలా?'' అని విసుక్కుంటున్నాడు.

''ఒరేయ్ రథం యిరుసుల్లోనూ, చక్రాల సందుల్లోనూ ఆవదం బాగా పొయ్యండ్రా! బండి కందిని యెక్కించండ్రా, లమ్డీ కొడకల్లారా– అని నిన్నటి నుంచి మొత్తుకుంటున్నాను. అంతా హేళాపనే'' అంటూ శివమెత్తినట్లు బూతులు గొణుక్కుంటున్నాడు సాంబడు.

''ఇంత ఖర్చు పెట్టి సంబరం చేస్తున్నాను. ఆదిలోనే ఏమిటీ అవాంతరం? రథం కదలడం లేదు! ఛీ, ఛీ!'' అంటూ మనస్సులో హైరాణ పడిపోతూ మాటిమాటికి కండువా సవరించుకుంటూ తల గోక్కుంటూ రోడ్డు ప్రక్కగా నిలబడి రథం వైపు ఆత్రుతగా చూస్తున్నాడు గంగరాజు.

''నాయనా, రాజుబాబూ! ఢక్కువాడు రథం మీద కనిపించడం లేదు. ఆడు లేడేంటి? మరి, ఈ శుభకార్యానికి ఆడులేకపోతే ఎలా? దేవుడికి దిష్టి తగిలిందేమో, రథం మొరాయిస్తోంది'' అన్నాడు మెల్లగా ప్రక్కనే నిల్చున్న ముసలాయిన.

''అవును, ఢక్కువాడు ఎక్కడ? కనిపించలేదేం? వాడ్ని పిలిపించండి!'' అని అందరూ గంగరాజు చుట్టూ చేరారు. ఢక్కువాడి పేరు వినగానే ఎవరో వి ఐ పి పేరు విన్నట్టు అక్కడున్న యువకుల్లో, కుర్రాళ్ళలో చిన్న సంచలనం బయలుదేరింది. ఒక్కసారి అందరూ అంతవరకూ పట్టించుకోని ఢక్కు వాడి గురించి మాట్లాడుతున్నారు.

జగన్నాథుడికి బూతులంటే మహాప్రీతి. చరాచర ప్రకృతి భారాన్ని తనలో ఇముడ్చుకుని మోస్తున్న మదన మోహనుడికి, బూతు పదం చెవిన పడితే చాలు మహదానందంతో ఉప్పొంగిపోయి రతి సుఖ స్మృతులతో దూదిపింజలా తేలిపోతూ పరవశించి పోతాడు. రథం మీద బూతు పాటలు పాడేవాణ్ణి ''ఢక్కువాడు'' అంటారు. ఆ పాటలు సూటిగా, మోటుగా కటువైన బూతులతో నిండివుంటాయి. సాధారణంగా ఆ పాటలన్నీ ఒరియా భాషలో వుంటాయి. ఆ పాటలు రాను రాను ప్రాంతీయత సంతరించుకొని ఒరియా, తెలుగు మిశ్రమంగానూ, ఢక్కువాడి స్వకల్పితమైన తెలుగు బూతులతోనూ నిండి వుంటాయి. అది వాళ్ళ తాత తండ్రుల నుంచి వంశ పారంపర్యంగా వస్తున్న వృత్తి విద్య.

''పూజారిగారూ, అన్నీ నేనొక్కణ్ణే చూసుకోవాలంటే ఎలా చచ్చేది చెప్పండి! దేవునికి సంబంధిం చిన విషయాలన్నీ మీరు చూసుకోవాలి గాని. ఆ ధక్కువాణ్ణి పిలిపించడం మానేశారు. త్వరగా పిలిపిం చండి''.

గత రెండేళ్ళుగా రథ జాత్ర లేకపోవడంతో ధక్కువాడి సంగతే మరిచిపోయాడు పూజారి.

వెంటనే ఒక కుర్రాడు జనాన్ని తోసుకుంటూ గాలిలా ధక్కువాడి కోసం పరుగెత్తాడు.

గంగరాజు, గబ గబ రథం దగ్గరికి వెళ్ళి గజ గజ వణికిపోతూ లెంపలేసుకుంటూ ''జగన్నాథ స్వామీ, పెద్దకళ్ళవాడా, నయన పథగామీ, దీనబంధో, అపచారం జరిగిపోయింది. ఏమిటిలా ఆగి పోయారు. ధక్కువాణ్ణి తీసుకొస్తున్నారు. రథంకదిలించండి!'' అని రథానికిఎదురుగా సాష్టాంగ పడిపోయేడు.

జగన్నాథ ప్రభూకీ జై! బోలో, జగన్నాధ్ కీ జై! అని ఒక్కసారి జనం ''జై'' కొట్టేరు. అంత వరకూ ఆగిపోయిన బాజాల్ని తిరిగి మ్రోగిస్తున్నారు. రథంమీద పూజార్లు కొబ్బరి కాయల్ని కొట్టడం తిరిగి మొదలు పెట్టారు.

''బాబూ, ధక్కువాడు రానంటున్నాడు. సాక్షాత్తు జగన్నాథ స్వామే రథం దిగివచ్చి బ్రతిమా గాని రానంటున్నాడు'' అన్నాడు; ధక్కువాడి కోసం వెళ్ళి తిరిగొచ్చిన కుర్రాడు ఒగర్చుకుంటూ.

''తాగున్నాడేంట్రా?'' ప్రశ్నించాడు పూజారి.

''అలాగే వుందండి. బ్లడీ భంచోత్. దేవుడి తరపున నువ్వు వస్తావుట్రా, లింగు లింగుమంటూ! .. గెటవుట్!'' అని గసిరేశాడండి.

''సరిపోయింది! ఈ జాతి తక్కువ నా కొడుకుని నేనే స్వయంగావెళ్ళి బ్రతిమాలాలి కాబోలు!'' అన్నాడు మనస్సులో చీదరించుకుంటూ గంగరాజు.

''ఆనవాయితీ సార్. తప్పుతుందా. వాళ్ళు జాత్రముందు అలగడం. ధర్మకర్తలు వెళ్ళి బ్రతిమాలి తీసుకురావడం ఆచారం. ఇంకా నయం, వీడి తండ్రి ; మీ తండ్రిగారు పల్లకీ తెస్తేనే గాని రాననే వాడు!'' అన్నాడు పూజారి.

''సరే, మీరూ రండి నాతో. ఇక్కడ తతంగం సాంబడు చూస్తూ వుంటాడు. ధక్కువాడికి కొత్త బట్టలు కొనాలి కాబోలు, కుర్రాడిని పంపించి తెప్పించండి'' అని జేబులో డబ్బు తీసి పూజారికి ఇచ్చాడు.

''ఒరే, అబ్బీ చూడు ; కొత్త పంచ, కండువా, గాపంచా ఈ మూడూ బజార్లో కొనుక్కుని తిన్నగా ధక్కువాడింటికి వచ్చేయి. అక్కడ మేం వుంటాం'' అని కుర్రాడ్ని పురమాయించి తోలాడు పూజారి.

గంగరాజు, పూజారి ధక్కువాడి ఇంటికి బయలుదేరారు.

ధక్కువాడి పూరి గుడిసె ఊరవతల వుంది. ఇంటి చుట్టూ కుళ్ళు కాలవలకంపు. ప్రక్కనే పాడు పడిపోయిన చెరువు వుండడం వల్ల ధక్కువాడి మట్టికొంప ఎల్లప్పుడూ తేమతేమగా ఉంటుంది. నాచు వాసన. పెల్లలు ఊడిన మట్టి గోడలు మసిబారి వున్నాయి. వాటి మధ్యలో అక్కడక్కడ తేమకి నాచు పట్టిన ఆకుపచ్చని చారికలు. చూరులు జారిన గుడిసెకి మాసికలు వేసినట్లు ఇంటి పైకప్పు మీద డబ్బా రేకులు అక్కడక్కడ అమర్చి వున్నాయి.

ఢక్కువాడు ఆ చీకటి కొంపలో భార్యతో కాపురం వుంటున్నాడు. ఏభై సంవత్సరాలు దాటిన వాడు. దరిద్రంతోనూ, రోగాలతోనూ నలిగిపోయి అరవై సంవత్సరాలు పై బడ్డట్టు కనిపిస్తాడు. ఒక్క గానొక్క కొడుకు కూడా నెల రోజుల క్రితం రోగంతో తీసుకుని తీసుకుని చచ్చిపోయాడు. ఆ దెబ్బకి ఢక్కువాడు వ్రేళ్ళు దొలిచేసిన చెట్టులా మ్రోడువారిపోయాడు. వాడి ముఖం తర తరాల నుంచీ జీర్ణించుకు పోయిన దరిద్రంతో ముడతలు దేరి, బీటలు తేరిన ఎడారిలా వుంది. కూలిపని చేసి పొట్ట నింపుకుంటాడు. వాడి తాతలు, తండ్రులు అందరూ ఢక్కువారే. అందరూ ఆగర్భ దరిద్రులే. అలానే చచ్చారు. వైద్య విద్యార్థుల ముందు మార్చురీలో బల్లమీద శవం ప్రాముఖ్యత సంతరించు కున్నట్లు, ఏడాది కొకసారి రథయాత్రకి ఢక్కువాడికి ప్రాముఖ్యం లభిస్తుంది. ఆరోజు వాడు తిట్టిన బూతు తిట్లకు పదో పాతికో కట్నం రూపంలో ముడ్తుంది. కొత్త బట్టలు దొరుకుతాయి. అశేష జనాన్ని ఆనందంతో ముంచెత్తిన ఢక్కువాడు ఆ మర్నాడు తిరిగి విషాద తెరల మాటుకి వెళ్ళిపోతాడు.

ఢక్కువాడు పొయ్యి కుదురికి చారబడి కాళ్ళు చాచుకుని కూర్చున్నాడు. వాడి తల నిషామత్తులో ఉరితీసిన తలలా ముందుకు వేలాడుతోంది. వుండుండి దాన్ని అతి కష్టంగా, బరువుగా ఎత్తడానికి ప్రయత్నిస్తున్నాడు. చెమటతో తడిసిన జిడ్డు మొహంలో నుంచి వాడి కళ్ళు ఆరిపోతున్న నిప్పు కణికల్లా జేవురించి వున్నాయి.

''ఢక్కువా.. ఢక్కువా... ఒరేయ్ ఢక్కువా!''

''ఊ... ''అని గంభీరంగా మూలిగి, భారంగా తలెత్తుతూ గుమ్మం దగ్గర నిలబడ్డ గంగరాజును చూశాడు. కళ్ళు పెద్దవి చేసి, పెదాల్ని సగం విప్పి తీక్షణంగా దెయ్యం పట్టినట్లు అదే పనిగా చూసి చూసి, ఒక్క ఊపున బలం కూడగట్టుకుని స్ప్రింగులేచినట్లు చెంగున లేచి పక్కనున్న కుండల్ని తన్నేసుకుంటూ, తూలిపోతూ, తమాయించుకుని నిల్చుని; శివమెత్తినట్లు వెనక్కి ముందుకి ఊగుతున్నాడు ఢక్కువాడు.

''ఒరేయ్! పద.. పదరా.. రథం ఆగిపోయింది. త్వరగా బయలుదేరు!'' అని హెచ్చరించేడు గంగరాజు. ఈ అలికిడికి పెరట్లో పని చేసుకుంటున్న ఢక్కువాడి పెళ్ళాం ఆదెమ్మ గబ గబ వచ్చి ''దండాలు బాబుగారు, ప్రొద్దుట్నుంచి తెగ తాగేసి తిరుగుతున్నాడు. వారం రోజుల్నించి మరీ ఎక్కువైపోనాది. తిండి తినడం మానేసి కొడుకుని తల్చుకుంటూ, ఏడ్చుకుంటూ, తాగుకుంటూ, తిరుగుతున్నాడు. కూలికెళ్ళడు. ఎళ్ళినా డబ్బులింటిలో ఇవ్వడు, పస్తులుంటున్నాం.. ఇదిగో, ఇటు ఇనుకో; బాబు లొచ్చారు. జాతర కెళ్ళేల్లు!'' అని తూలుతున్న మొగుడ్ని కుదుపుతూ అంది.

''జాత్తర.. ఊహ్ ?'' అని క్రింది పెదాన్ని వికృతంగా కదిలించుకుంటూ నవ్వాడు. ''నెలరోజుల క్రితం నా కొడుక్కి స్మశానంలో పెద్ద జాతర చేశాను. ఈరోజు దేవుడికి జాత్తర పట్టిస్తాను. ఓ! గంగరాజు బాబు! దరమకర్త!! దండాలు బాబయ్యా.. పతాసులో వున్నాను, చమించాల!''

'' ఏటి, బాబులొస్తే మరియాద లేకండా? పద, పద!'' అంటూ చీదరించుకుంది ఆదెమ్మ.

''బాబులొస్తారే! ఎవడి బాబు కోసం? రెండేళ్ళ నించి నేను సచ్చానో వున్నానో పట్టించుకోలేని బాబులు, ఈయేళ యెందు కొచ్చారే? ఆల్లవసరం.. నేను.. అంటే, నేను! ఈ ఏళ రాజా! నాన్నేక పోతే రథం కదలదు. నేను బూతుల మాస్టర్ని, మా తాతల నాటి నుంచీ ఈ దేవుణ్ణి తిడుతున్నాం.

ఆ దేవుడు నా కొడుక్కి తిట్లంటే మహా సరదా. కులాసా యెక్కిపోయి జాతర చేసినోళ్ళకి వరా లిచ్చేస్తాడు. ఆళ్ళ ఇంటిలో లచ్చిందేవి దూరిపోద్ది. తిట్టిన నా కొడుకులం మాకు చేతిలో బొచ్చి, నోట్లో బెడ్డ! ఇదండీ న్యాయం. మా తాత ! ఆడికి గుర్రం ఎక్కించి తీసుకెళ్ళేవోరట జాతరకి.. ఇంట్లో పిల్లులు తొంగుండేవి. ఆడు ఊరంతా అప్పులు చేసి చేసి రైలుకింద బుర్రెట్టేసినాడు.. మా బాబు.. ఏటి, మా బాబు! బా...'' అని నోటిలోని మాట నోటిలోనే వుంది; భళ్ళున కక్కేశాడు. సారా కంపుతో ఇల్లు రేగిపోతోంది.

''ఒరే, ఢక్కువా నా కొడకా! స్నానం చేసి రారా! బాబు కొత్త బట్టలు కొని తెచ్చేడు. కట్టుకొని తొందరగా బయలుదేర్రా, నా కొడకా!'' అని పూజారి గర్జించేడు.

''కొత్త బట్టలా, ఓల్‌రైట్!'' అని కుర్రాడు తెచ్చిన బట్టల్ని అందుకున్నాడు.

''మరి కట్నం?''

''ఒరేయ్, నీకు పుణ్యముంటుంది; .వేగంగా కదల్రా బాబూ...... ఇదుగో ఇరవై !''అంటూ రెండు పది రూపాయల నోట్లుని తీసి ఢక్కు వాడి చేతిలో పెట్టబోయాడు గంగరాజు. ఢక్కువాడు చెయ్యి వెనక్కి లాక్కొని నోట్ల వైపు తేరిపారజూసి ''నో, నో! ఫిఫ్టీ డాలర్స్, ఏభై . లేకపోతే నేను రానె హోయ్!'' అని అమాంతం చతికిలబడిపోయి మఠం వేసుకుని యథాప్రకారం తలని భారంగా వాల్చేసి కళ్ళు మూసుకున్నాడు.

''మందు ఎక్కువైపోయింది. ఇంగ్లీష్ మొదలుపెట్టేడు. అమెరికన్ డాలర్స్ కావాలట!'' అని పూజారి ఫకాలున నవ్వి గంగరాజు వైపు చూశాడు.

''ఇంగ్లీషులోనే తిడతాను.. ఫకాఫ్''..

''ఇదుగో ఆదెమ్మా, వీణ్ణి పెరట్లోకి తీసికెళ్ళి తరవాణీ పట్టించి నాలుగు బిందెల నీళ్ళు దిమ్మ రించు; నిషా వదిలిపోతుంది!'' అని పూజారి పురమాయించేడు.

''పట్టుపూరాగా ఒగ్గేస్తుందండి, మరి ఫిఫ్టీ ... ఏభై?''

''ఇందరా, దొంగనా కొడకా. వేగంగా తయారవు.'' అని మిగతా ముప్ఫయి కలిపి, మొత్తం ఏభై చేతిలో పెట్టాడు గంగరాజు.

''మీరెళ్ళండి బాబూ, సిటంలో ఈణ్ణి తయారుచేసి పంపుతాను!'' అని ఆదెమ్మ ఢక్కువాణ్ణి లేవనెత్తి పెరట్లోకి తీసికెళ్ళింది.

''రాజుగారూ, మీరిక్కడే వుండండి. నేను వెళ్ళి మంగలి బాజాని, పూలదండల్ని పంపిస్తాను దగ్గిరుండి మీరు తీసుకురండి.'' అని గబ గబా వెళ్ళి పోయాడు పూజారి.

తూలుతున్న ఢక్కువాడి జబ్బ పట్టుకుని పెరట్లోకి తీసుకెళ్ళింది ఆదెమ్మ. గిన్నెడు తరవాణి తాగించింది. పుల్లటి తరవాణి తాగి ఆ పులుపుకి మొగమంతా పులిసి పోయినట్లు వికృతంగా చిట్లించుకుంటూ బ్రేవ్ మని త్రేన్చాడు.

''ఇక్కడకూకో, నీళ్ళు గుమ్మరిస్తాను.

''ఇక్కడ కాదు.. అక్కడ. నా కొడుకు శవాన్ని స్నానం చేయించిన దగ్గరే నాకూ నీళ్ళు పొయ్యి!'' అని రుద్ధకంఠంతో తడబడుతూ వెళ్ళి కూర్చున్నాడు. కొడుకు మాట ఎత్తగానే గుండెల్లో నుంచి వస్తున్న దుఃఖాన్ని పెదాల్తో బిగబట్టి దిగమింగుకుంటూ జల జలా రాల్తున్న కన్నీటిని చేత్తో

తుడుచుకుంటూ ఢక్కు వాడికి స్నానం చేయిస్తోంది ఆదెమ్మ.

''ఏటే, ఏడుస్తున్నావా? నోర్మూయ్యహే!.. ఆడు అన్ని బాధల్ని పూరాగా ఈ భూమ్మీద ఒగ్గేసి ఎల్లిపోయేడు... ఇక నీ సావూ నా సావూ చూడు.. నువ్వు తిన్నావే? తినలేదు కదూ. ఇంట్లో నూకల్లేకపోతే, ఈరిగాడి పెళ్ళాన్ని ఒన్నం అడుక్కుని తినలేక పోయావా?''

''ఇంట్లో మొగోడు సరిగ్గా నేడని అందరిళ్ళ కెళ్ళి అడుక్కోమంటావా. నీ దగ్గర ఏభై రూపాయలు ఇలాతే. మనం తిన్నా తినకపోయినా ముందు అప్పులోళ్ళ సంగతి చూడు. బజార్లో పట్టుకుని నన్ను నానా తిట్లు తిడతన్నారు''.

''అప్పులు చెయ్యడం, తిట్లు తినడం, పస్తులుండటం మన కలవాటేనే. ఈ అప్పు తీరిస్తే మళ్ళీ మరో అప్పు. అప్పుడెక్కడ్నించి వస్తయి పైసాలు.. ఈరోజు నేను రాజా.. ఈ రోజు పోతే రేపు మరి నాకు లేదు. జాతర, జగన్నాథ జాతర. ఫుల్‌గా పతాసు కొట్టేస్తాను. నువ్వూ చుక్కేసుకోయే, అన్ని బాధలూ ఎగిరిపోతాయి. మాంచి ఫోర్సు వస్తాది. ఎవడైనా అప్పు తీర్చమని అడిగితే ఎగిరి గుండెల మీద తన్నెయి.''

''ఏటీ గాచారం! తిండికి లేక సస్తుంటే తాగుతానంటా వేటి?''

''సవ్వు.. సవ్వు తొత్తు కూతురా.. ఇప్పుడే సావు''.

దూరంగా బాజాల మోత. రాను రాను సన్నాయి మేళం, జేగంటలు దగ్గరవుతూ వచ్చి ఢక్కు వాడి ఇంటి ముందర ఆగాయి. చుట్టు ప్రక్కల వాళ్ళు ఇంటిముందు గుమిగూడేరు.

''బాజాలు వెలిపొచ్చేయి. త్వరగా బయలుదేరు!'' అని ఆదెమ్మ ఢక్కువాడి ఒళ్ళంతా తుడిచి కొత్తబట్టలు కట్టించింది.

ఢక్కువాడు తెల్లటి కొత్త పంచ కట్టుకున్నాడు. కొత్త తలపాగా చుట్టేడు. కండువా నడుంకి బిగించి కట్టేడు. చేతి కర్రకి రంగు గావంచ కట్టి యెత్తి పట్టుకుని గుమ్మంలోంచి బయటకు వచ్చి వాకిట్లో నిల్చున్నాడు.

ఢక్కువాడు అలా పైకి రాగానే ఒక్కసారి వాయిద్యాలు తారాస్థాయి నందుకున్నాయి.

గంగరాజు స్వయంగా ఢక్కువాడి కాళ్ళు కడిగి మెడలో పూలదండ వేసి నమస్కరించేడు.

''జై, జగన్నాథ మహాప్రభూకీ, జై!'' అని గంగరాజు అరుస్తూ బయలుదేరమని ఢక్కువాడికి స్వాగతం పలికేడు.

ఢక్కువాడు రథయాత్రకి బయలుదేరాడు.

ముందు సన్నాయి మేళం, ఇరుప్రక్కలా జేగంటలు, ప్రక్కగా గంగరాజు.

గావంచా కట్టిన గొడుగు కర్రని కుడిచేత్తో పట్టుకుని, మెడలో పూలదండలు ఊగుతుండగా కాలి మడమలలో స్ప్రింగులున్నట్లు ఎగిరెగురుతూ హుందాగా నడుస్తూ రథం దగ్గరకి బయలు దేరాడు. ఢక్కువాడ్ని సగం దూరం సాగనంపి ఆదెమ్మ తిరిగి వచ్చేసింది.

''ఢక్కు వాడొచ్చేడు! ఢక్కు వాడొచ్చేడు!'' అంటూ జనం గోల గోల చేసుకుంటూ వాడ్ని చుట్టుముట్టేరు. వాడిమీద పడి పోతున్నారు. వాళ్ళందర్నీ పక్కకు నెడుతూ నిచ్చెన వేసి ఢక్కు వాడ్ని రథం మీదికి ఎక్కించేరు. దూరంలో వున్న జనం తోసుకుంటూ జన సమ్మర్దంలో నించి

ముందుకు రాలేక, ఇంటి అరుగుల మీదికి ఎక్కిపోతూ ఎగబడి చూస్తున్నారు. తండ్రులు పిల్లల్ని భుజాల మీద ఎక్కించుకుని ఢక్కువాడ్ని చూపిస్తున్నారు. ఢక్కువాడు దేవుడికి సాష్టాంగ పడి లేచాడు. శఠగోపం పుచ్చుకొని పూజారి ఇచ్చిన తులసి ప్రసాదాన్ని నోట్లో వేసుకున్నాడు. పూజారి వాడి తలపాగాకి సన్నటి పూలదండని తగిలించాడు. ఢక్కువాడు రథం ముందుకు వచ్చి ఒక్కసారి జనాన్నంతా కలయజూశాడు. ముఖం మీద పూలదండ ఊగులాడుతోంది. నడుం మీద చెయ్యి ఆనించి గొడుక్కర్రని ఆకాశం వైపు ఎత్తి చూపుతూ విచిత్ర భంగిమలో క్షణం సేపు నిలబడి ''ఆపండి.. బొందొకొరో.'' అని వాయిద్యాల వాళ్ళవైపు అరిచాడు. వాయిద్యాల్ని ఆపుచేశారు. జనమంతా నిశ్శబ్దంగా ఢక్కువాడివైపు తదేక దీక్షతో చూస్తున్నారు.

''తైతైతకతైతై.. తెతైతకతైతై'' అంటూ సంకీర్తన మేళగాళ్ళని గొడుగు కర్రని ఆడిస్తూ హెచ్చరించేడు.

''ఢింఢిం తకఢింఢిం.. ఢింఢిం తకఢింఢిం'' అంటూ మృదంగాల్ని వాయిస్తూ ఎగురెగురుతూ జవాబు చెప్పేరు.

''ఢైంయ్.. ఢైంయ్.. ఠక.. ఢైంయ్.. ఢైంయ్''.. మంటూ జేగంటల్ని వాయిస్తూ ఇరుప్రక్కలా నిల్చున్న జేగంటల వాళ్ళు వంతవాయింపు వాయించేరు.

''రాధా ఢీకా ఢీకాయిలా! మహా ప్రొంకొరొ కొండియా.. నపాయిలా.. తైతైతక తైతై .. ఆహ్హా. ఆహ్హా.. తకతైతై ''అంటూ అర్ధనిమీలిత నేత్రాలతో వలయాకారంగా నడ్డి తిప్పుకుంటూ రథం మీద గెంతుతున్నాడు ఢక్కువాడు. లయబద్ధంగా కింద మృదంగాలు, పైన జైగంటలూ వాయించుకుంటూ ఢక్కు వాడ్ని అనుసరిస్తూ తక్కిన వాళ్ళు నాట్యం చేస్తున్నారు.

బూతు పేలింది. జగన్నాధ రథ చక్రాలు కదిలేయి.

ఆ పాటకి అర్ధం యేమిటన్నట్లు ప్రక్కనున్న పూజారికి సౌంజ్ఞ చేశాడు గంగరాజు. ఒరియా భాషతెలిసిన పూజారి గంగరాజు దగ్గరగా వెళ్ళి ''జగన్నాథ రథం వెనక్కీ ముందుకీ ఊగుతోంది. ఎంత వూగినా మొండి జగ్గడి ''మొండి!'' అందడం లేదు. అని మధ్య మాటల్ని గంగరాజు చెవిలో గొణిగాడు. గంగరాజు ముసిముసి నవ్వుల్ని నవ్వుకుంటూ మీసాల్ని చేత్తో దువ్వుకుంటూసంబరంతో పాటు ముందుకు నడుస్తున్నాడు.

ఆముదంతో నిండిన రథ చక్రాలు సాఫీగా ఉల్లాసంగా కదుల్తున్నాయి.

ఢక్కువాడు మరోపాట అందుకున్నాడు.

''జెండా రథ మెక్కింది.

చుక్క నింగెక్కింది

శ్రీ కృష్ణుడి చెల్లెమ్మకి దూలెక్కింది;

తైతైతకతైతై !'' అంటూ గొడుగు కర్రని ఎత్తిపట్టుకుని ఎడం చెయ్యి నడ్డిమీద ఆనించి భరతనాట్య భంగిమలో రథం దద్దరిల్లి పోయేట్లు గెంతుతున్నాడు. జనం గొల్లున నవ్వుతున్నారు. కుర్రకారు కిర్రెక్కిపోతూ ఢక్కువాడి ఆటకు లయగా ఈలలు వేస్తున్నారు.

రథం జోరు పుంజుకుంటోంది. బూతు పాటలకి హుషారెక్కిన జనం మరింత ఉత్సాహంతో రథాన్ని తోస్తున్నారు. ఆకాశంలో మబ్బులు లుంగలు చుట్టుకుంటూ భారంగా నడుస్తున్నాయి. రథ

శిఖరాగ్రాన అమర్చిన నీలిచక్రం దూరం నుంచి మబ్బుల్లోంచి దూసుకువస్తున్న సుదర్శనంలా వుంది.

కొబ్బరి కాయలు వందల సంఖ్యలో పెరేలు పెరేలు మని పగులుతున్నాయి.

కర్పూర హారతి కాంతుల్లో నేత్రోత్సవంలో కొత్త రంగులు దిద్దుకున్న వనమాలి నవకళేబరంలో ప్రతిఫలిస్తున్నాయి. ఢక్కువాడి బూతుపాటకికై పెక్కిపోతున్న సుభద్రాదేవి సిగ్గుతో ఫల్గుణుడి వైపు ఓరగా చూస్తోంది. విజయుడు జవనాశ్వాల్ని నురగలు కక్కేలా పరిగెత్తిస్తూ తన సారథ్య నైపుణ్యాన్ని ప్రియురాలిముందు ప్రదర్శిస్తున్నాడు.

బూతు పాటలకి కొత్త శక్తిని పుంజుకుంటున్న రథం జోరుగా పరుగెత్తుతోంది.

''యమునాతీరే ..కుంజా బిహారీ..'' అని ఆడదానిలా సిగ్గుతెరలు ముంచుకొస్తున్నట్లుబుగ్గమీద వేలు పెట్టుకుని వయ్యారం ఒలికిస్తూ పృష్ఠభాగాన్ని జనం వైపు తిప్పి ఆడించుకుంటూ గుండ్రంగా తిరుగుతున్నాడు ఢక్కువాడు. ఈ పాటలో భాష సరిగ్గా అర్ధంకాక పేలలేదు. కాని వాడి నాట్య భంగిమ చూస్తున్న జనం ఆ పాటలో నిగూఢమైన చాలా పెద్ద బూతు వుండి వుంటుందని నిశ్చేష్టులై చూస్తున్నారు.

''ఏమిటండోయ్, పూజారిగారూ; ఇదేదో తమాషాగా వుందీఆట! ఇంతకీ ఏమంటాడు?''

''యమునా సైకతాల్లో విరబూసిన పొగడ చెట్టు మాటున రాధ-గోపాల దేవునిపై నుంచి పుంభావ కేళీ సలుపుతోంది!'' అని కిసుక్కున నవ్వేడు పూజారి.

''ఆఁ?'' అని అర్ధం కాక మరికాస్త వివరంగా చెప్పమన్నట్లు చూశాడు గంగరాజు పూజారివైపు.

'' ఛ్, అదేనండి; ఉపరతి! అబ్బా '' అని గంగరాజు దగ్గరగా వెళ్ళి ''కృష్ణుడి మీద రాధ ఎక్కిపోతోందండీ!''

''అమ్మగాడిద కొడుకు!'' అంటూ రాధా మాధవుల రాసకేళీ బంధనాల్ని వూహించుకుంటూ ఢక్కువాడ్ని మనస్సులో శ్లాఘించుకుంటూ వెనక్కి తిరిగి రథం మీదికి చూశాడు గంగరాజు. మదవతీ మోహనుడి ముఖం రసికావేశంలో చిరుచెమటలు పట్టినట్టు కొబ్బరి నీటి బొట్లతో నిండి వుంది.

ఢక్కువాడు పాటలు పాడుతూ రక రకాలుగా గెంతుతున్నాడు. ఒక్కొక్కసారి గుర్రంలా ట్రాటింగ్ చేస్తున్నాడు. మరోసారి కోతిలా యెగురుతున్నాడు. మధ్య మధ్యలో రథం వెనక్కి వెళ్ళి కుర్రాళ్ళతో సారా తెప్పించుకుని తాగుతున్నాడు. ఒక చిన్న సీసాని జేబులో పెట్టుకున్నాడు. రాను రాను చిన్న తూలుడు ఆరంభమయింది. తమాయించుకుని పాడుతున్నాడు. జారిపోతున్న పంచను యెగగట్టుకుంటూ గెంతుతున్నాడు. అంతకంతకీ ఢక్కువాడికి జనంమసక మసగ్గా కనిపిస్తున్నారు. సడన్‌గా ష్రిల్ వాయిస్‌తో రాగం అందుకున్నాడు. చెవుకి చెయ్యి ఆనించి ఎడంకాలు ముందుకి దన్నుబెట్టి జనంలో ఆడవాళ్ళ వైపు తిరిగి కనుబొమ్మ లెగరేస్తూ చిరునవ్వు నవ్వుకుంటూ

''పెద్దా పెద్దా కళ్ళోడు

కాళ్ళు లేని కుంటోడు

మొండి చేతులోడు

దేవుణ్ణి అన్నాడు - దగ్గరకి రమ్మన్నాడు (ఆడవాళ్ళ వైపు కన్నుకొట్టాడు)

పసందైనా పడుచుగుంట పరికిణీ ఎత్తి చూపిస్తే

పసలేక చతికిల బడ్డాడే!.. ''తైతైతక తైతై'' ''తైతై తక తైతై'' తైతై తక తైతై'' అంటూ రెట్టింపు ఉద్వేగంతో ఆడవాళ్ళ వైపు చూసుకుంటూ ఎగురెగురుతూ గంతులేస్తున్నాడు. ఆడవాళ్ళు సిగ్గుతో తలవొంచుకుని కిసుక్కుమని నవ్వుకుంటున్నారు. ఒకరి నొకరు సిగ్గుతో పట్టేసుకుని ముఖాల్ని దాచు కుంటున్నారు. జనంలో ఈలలు.. నవ్వులు.. పల్లంలో రథం ధడ ధడ మని పరుగెత్తుతోంది.

రథం మీద ఆడుతున్న ధక్కువాడు బేలన్స్ తప్పి తూలిపోయి ప్రక్కనున్న పూజారి మీద పడ్డాడు.

ఇదంతా క్రింద నుంచి చూస్తున్న గంగరాజు ''సాంబా, ఈ ధక్కువాడు తాగేసినట్టున్నాడు, మళ్ళీ. రథం మీద నుంచి పడిపోగలడు. వెళ్ళి వాణ్ని రథం దింపరా, నాయనా!'' అని సాంబణ్ని పంపిస్తూ వుండగా రథం దగ్గర చిన్న గందర గోళం మొదలైంది. జనం ఘర్షణ పడుతున్నారు. సాంబడు పరుగెత్తాడు.

ఇందాకట్నించీ సంబరంలో తిరుగుతున్న గళ్ల చొక్కావాడు ఆ తగవులాటలోంచి గబ గబా రథం ఎక్కిపోయి ''లంజకొడకల్లారా, ఇది సంబరమా, సానిమేళమా?'' అని పూజారి పెద్ద కొడుకుని చొక్కా పట్టుకొని లాగి గూబ చెళ్ళు మనిపించాడు. ''కొబ్బరి కాయలు అందిస్తున్న ఆడవాళ్ళ చేతులు పట్టుకుంటావా? నీకు అప్ప చెల్లెళ్ళు లేర్రా?'' అని వాడిమీద హూంకరిస్తున్నాడు.

జనంలో త్రొక్కిసలాట ప్రారంభమైంది. అందరూ రథం దగ్గరకు పరుగెడుతున్నారు. రథం మీద పూజార్లు గళ్ల చొక్కా వాడిని అడ్డుకుంటూ పూజారి కొడుకును విడదీస్తున్నారు. పూజారి కొడుకు వాళ్ళని తోసుకుంటూ రౌడీ వెధవా, నన్ను అనవసరంగా కొడతావుట్రా? నేను ఆడవాళ్ళ చేతులు పట్టుకోవడం నువ్వు చూశావురా? గంగరాజు బాబూ, వీడు నన్ను చంపేస్తున్నాడండీ, బాబోయ్!'' అని రథం మీది నుంచి కేకలేస్తున్నాడు. ఇంతలో సాంబడు జనాన్ని తోసుకుంటూ రథం స్తంభం పట్టుకొని ఎగిరి మీదకెక్కి గళ్ళ చొక్కావాణ్ణి అమాంతగా జుత్తుపట్టుకుని క్రిందికి ఈడ్చు కొచ్చాడు.

''ఆడవాళ్ళని అల్లరిపెడుతూంటే చూస్తూ ఊరుకోవాలిరా?'' అని గళ్ళచొక్కా పార్టీవాళ్ళు అయి దారుగురు తగువుకి దిగేరు.

''అందరూ ఆగండి. వాడు ఆడవాళ్ళ చెయ్యి పట్టుకోవడం మీలో ఎవరు చూశారు? ఏ ఆడ కూతురు చెయ్యి పట్టుకున్నాడో వచ్చి చెప్పమను!''.

''ఏ ఆడదైనా ముందుకు వచ్చి చెప్తాదేంటి. నేను నా కళ్ళతో చూశాను. మర్యాదగా వదులు!'' అని సాంబడి మీద గళ్ళ చొక్కావాడు విరుచుకుపడ్డాడు.

''దొంగనాకొడకా, సంబరం భగ్నం చేయడానికి పితూరీ లేవదీస్తున్నావా? ఇది దేవుడి కార్యం రా! జాత్ర జరగనీకుండా రెండు సంవత్సరాలు దేవుణ్ణి కోర్టుకెక్కించార్రా. కమ్‌జాతి నా కొడక ల్లారా, కుష్ఠు రోగం పడి చస్తార్రా! ఎంకునాయుడు ఎంగిలి కూడు కతికి జగడానికి వస్తావా? కాసుకో! అంటూ డొక్కలో బలం పూర్తిగా వొక్క తన్నుతన్నాడు. అంతే. తలావొక తన్ను చేతి కొచ్చిన దెబ్బ. క్రింద పడేసి యీడ్చి యీడ్చి తంతున్నారు. వాడి పార్టీ వాళ్ళు అంగ బలం చాలక

మెల్లగా జారుకున్నారు. ''ఆగండి!''.. అన్న గంగ రాజు కేకతో వాణ్ణి కొట్టడం ఆపుచేశారు. గంగరాజు వాడి కాలరు పట్టుకొని లేవదీసి జనంలోంచి గెంటుకుంటుపక్కకి తీసికెళ్ళి ''బతికి పోయావు, ఫో!'' అని వదిలేశాడు . గళ్ల చొక్కావాడు దెబ్బలతోనూ అవమాన భారంతోనూ రొప్పుకుంటూ, వొళ్ళు దులుపుకుంటూ ''నన్ను కొడతారు కదూ, మీరంతా? సరే,''అని హెచ్చరిస్తూ తూలు కుంటూ జనంలో నుంచి వెళ్ళిపోతున్నాడు.

''పాతేస్తాను, నా కొడకా!''అని వాణ్ణి వెంబడిస్తున్న సాంబణ్ని ''ఊఁ''అని సౌంజ్ఞతో ఆపు చేశాడు గంగరాజు. ''జాత్ర కానీయండి - ఊఁ - రథం కదిలించండి!''

సాంబడు ఎగస్పార్టీ వాళ్ళ మీద కసితో మరింత బిగ్గరగా గొంతెత్తి ''జై , జగన్నాథ మహా ప్రభూకీ, జై ! - బోలో జగన్నాథ్‌కీ జై'' అని చెయ్యి మీద కెత్తి తిప్పుతూ, రథాన్ని కదిలించమని సౌంజ్ఞ చేశాడు. రథం కదిలింది - సంబరం తిరిగి ప్రారంభమైంది.

బాజాలు, జేగంటలు మ్రోగుతున్నాయి. ఈ సందడిలో ఢక్కువాడు ఎప్పుడోగాని క్రిందికి దిగి పోయేడు. అందరి మధ్య నుండి తోసుకొస్తూ ''ఆపండి, బంద్ కరో! హోల్డాన్ !'' అని గట్టిగా అరిచాడు. అందరూ మూగుతున్నారు. ఢక్కువాడు జేబులోంచి సీసా తీసి డగ్ డగ్ మని గుటకలు వేస్తూ తాగేసి ముఖం చిట్లించుకుంటూ మూతి తుడుచుకున్నాడు. సీసాని జనం తలల మీది నుంచి కాలవ లోకి విసిరేశాడు. ''పూజారి కొడుకు ఆడవాళ్ళ చేతులు తడమడం తప్పా? మరి తప్పే అనుకో; పాయింటు? మరి, ఈ దేవుడు ఎందరి ఆడాళ్ళ చేతులు పట్టుకోలేదు?! ఒక చెయ్యేటి, అన్నీ పట్టు కున్నాడు! ఇది తప్పు కాదా? మరి ఈ పాయింటు? మరి అదీ పాయింటే, ఇదీ పాయింటే! ఏది పాయింటు?'' అని అందరినీ గుండెల మీద చరుస్తూ క్రాస్ యెగ్జామినేషన్ మొదలుపెట్టాడు.

''ఒరే, ఢక్కువా; దేవుణ్ని మనుషుల్తో సమానం చేస్తావురా? తాగేసున్నావు. తిన్నగా రథం యెక్కు!''

''నేనెక్కనండి! దేవుడు చేస్తే రాసక్రీడలా? మనుషులు చేస్తే పోకిరీ వేషాలా? ఏం పాయింటండీ! దేవుడు గొప్పోడు. ఆడికి భజనలు చేస్తున్న మీరంతా గొప్పోళ్ళు. గొప్పోళ్ళది లవ్; పేదోళ్ళది రంకు తనం!''

''దేవుణ్ని తిట్టకురా, లంజకొడకా; కళ్ళు పోతాయి! ఒరేయ్, వీడితోనేంట్రాతంటా? రథాన్ని లాగండి!'' అని సాంబడు అరిచాడు.

''కొవ్వెక్కిన దేవుడికి బూతులంటే మహాసరదా అండీ, మహాప్రభో; - నీకు తెలీదేటండీ? ఈడు సాలా మంది ఆడస్త్రీల్ని పాడు చేశాడు. సల్లముంతలు పట్టుకొచ్చిన గుంటల్ని తగులుకున్నాడు. పెద్ద కుండకి ఎసరెట్టాడు. మేనత్తమీదికి ఎక్కిపోయాడండీ పరమేశ్వరా!'' అని చివరి మాటల్ని రాగ యుక్తంగా చదివాడు.

''మనం కేవలం మనుష్యమాత్రులం. ఆ మహానుభావుడి లీలలు మనకి అర్థం కావురా. జగన్నాథుడు దీనజనోద్ధారకుడు.'' అని ప్రక్కనున్న ఆసామి ఎవరో జ్ఞానబోధ చేస్తుంటే, రెండు

రోజు ల్నించి తిండిలేక ఆకలితో మండిపోతున్న కడుపులోకి సారా పడి పడి దావానలంతా భగ్గు భగ్గున లేచాడు ఢక్కువాడు.

''ఈ లక్ష్మీ కొడుకు దేవుడు ; దీనజనులను రచ్చిస్తాడా? ఎవ్డ్రా నువ్వు? నేను దరిద్రపు నా కొడుకుని, నా బాబూ తాతతండ్రులందరూ దరిద్రంతో బతికి ఆకలితో సచ్చారు. తర తరాల నుంచి మా బూతులు యింటూ కులాసా పడిపోతున్న దేవుడు మా ఆకలి తీర్చాడా, నా కొడుకుని రచ్చించాడా? నేనేం పాపం చేశాను? ఢక్కు వాడి కంఠం రుద్ధం అవుతోంది. ''గంగరాజు బాబూ, బాబూ; గంగరాజు బాబూ, నేనన్నానని మరేమీ అనుకోకు. నీ డబ్బుచ్చుకుని తాగేసి గెంతుతున్నాను గాని నా గుండెల్లో కుంపట్లు రాజుకుంటున్నాయి. అగ్గిమంట. ''నా కొడుకు పోయాడు నాయనా. దీపం ఆరిపోయింది. ఆరు నెలలు రోగంతో తీసుకుని తీసుకుని మందు ల్లేక, తిండిలేక తడపలా అయి పోయి, బిళ్ళ బిళ్ళలు రకతం... ''బాల్బీడు రకతం కక్కుకుంటూ సచ్చిపోయేడు. నా పద్దెనిమిదేళ్ళ కొడుకు ఎలిపోయాడు నాయనా!'' అని గొల్లున ఏడుస్తూ కుప్పలా కూలి పోయాడు. వాడి ఏడుపు గొంతుకోసిన గొడ్డు అరుపులా ఉంది. జనం వాడ్ని ఓదారుస్తూ లేవ నెత్తారు. అందర్నీ ఒక్కసారి విదిలించుకుంటూ దుఃఖాన్నంతా ఒక్క గుక్కన దిగమింగాడు గరళంలా.

కోపంతో పెదాల్నికొరుక్కుంటూ నిప్పులు చెరిగే కళ్ళతో పరుగున వెళ్ళి రథానికి అడ్డంగానిల్చుని దేవుణ్ని డైరెక్టుగా ఎడ్రసు చేస్తూ చేతుల్తో తాటిస్తూ ''నువ్వు దేవుడివా? నీకు నేను బూతులతో ఖుషీచేస్తుంటే రథం ఎక్కి కులుకుతున్నావు. కొయ్య బొమ్మవి! నీకు నగలు తొడిగి, నైవేద్యం పెట్టి చందాలెత్తి సంబరం చేస్తారు ఈ తెలివి తక్కువ నా కొడుకులు. నేను మనిషిని. అడుక్కున్నా పైసాయివ్వరు. ఆకల్తో సావ్వలసిందే. కడుపులు కాల్తున్నా లేని సరదా తెచ్చుకొని నిన్ను ఖుషీచేస్తున్నాను. నా కొడుకుని తినేశావ్ నన్నూ తినేయ్.. నా పెళ్ళాం రోడ్డు మీద అడు క్కుని అదీ సస్తాది. నువ్వు రథం మీద వూరేగు. జేగంటలు కొట్టించుకో. నువ్వు దేవుడివా? లస్కటపర్ నా కొడకా! ఒరేయ్, ఝూతర్ ఢమాల్.. ఈడు ఆడి చెల్లెల్ని ఆడి బావమరిదికి తార్చా డండీ!'' అని జనానికి చెప్తున్నాడు. ''ఈడు బోకరు నాకొడుకు. లాడ్జింగ్‌లో బుకింగ్ ఎట్టీలేక పోయావురా?.. నీ పరువు తీసేస్తాను. నిన్ను చక్రంతో ఖండించేస్తాను!'' అంటూ ప్రక్కనున్న పెద్దరాయిని అందుకుని రథం మీదకి విసరబోయేడు. అందరూ పట్టుకుని ఆపుచేశారు.

''ఒరేయ్ ఢక్కువా, నీకు పుణ్యం వుంటుందిరా బాబూ; గోల చెయ్యకురా! నీకు మరో సీసా తెప్పిస్తాను. రథం ఎక్కి వెనకాల నిమ్మళంగా తొంగో.'' అంటూ సాంబడు ఢక్కువాడ్ని తీసుకు పోతు న్నాడు. తిరిగి పరుగెత్తబోతుంటే పట్టుకుంటున్నాడు. ఢక్కు వాడు నడుచుకుంటూ తిడు తున్నాడు, ఏడుస్తున్నాడు. గుండెలు బాదుకుంటున్నాడు. ''నా చెట్టంత కొడుకు యెల్లి పోయాడు'' అంటూ జనానికి, చెట్లకి, చేమలకి, ఆకాశానికి వాడిగోడు చెబుతున్నాడు. సాంబడు వాడ్ని బుజ్జగిస్తూ ఓదారుస్తూ మెల్లగా రథం యెక్కించి వెనకాల యెవరికీ కనబడకుండా పడుకో బెట్టాడు. ఢక్కువాడు రథం వెనకాల వాంతి చేసుకున్నాడు. మూలుగుతున్నాడు, నిషాలో నిద్రలో యేడుస్తున్నాడు. వంటి మీద తెలివి లేకుండా పడుకున్నాడు.

చీకటిపడింది. గేస్‌లైట్లు, దివిటీలు వెలిగించారు. దీపపు కాంతుల్లో రథం మరీ అందంగా కనిపిస్తోంది. విగ్రహాలకి తొడిగిన ఆభరణాల మీద జరీ పట్టులపైన దీపపు కాంతులు ప్రతిఫలిస్తూ కొత్త కాంతుల్ని విరజిమ్ముతున్నాయి. రథానికి వేలాడదీసిన ఇత్తడి ప్రమిదలు స్తంభాలకి అమర్చిన అద్దాల్లోంచి జగన్నాథుని కొలువుకూటాన్ని అలంకరించిన కోటి దీపాల్లా భ్రమింప జేస్తున్నాయి.

రథం మరో గంటలో గుడిసెన్న గుడికి చేరుకుంటుంది. నారాయణుడు రథికుడుగానూ, నరుడు సారథిగానూ రథం వెలుగుల్ని చిమ్ముకుంటూ చీకట్లని చీల్చుకుని పరుగెడుతోంది.

''గంగరాజుబాబూ, ఆ ఢక్కువాడ్ని పడుకోబెట్టేటప్పటికి నాతలప్రాణం తోక్కొచ్చింది. డోసెక్కు వైపోయిందేమో, ఒక్కొక్కసారి గొల్లుమనిఏడుస్తున్నాడు. ఒక్కొక్కసారి దేవుణ్ణి చంపేస్తానంటున్నాడు రథం క్రింద పడిపోతానంటున్నాడు. అసలే పూటకి ఠికాణాలేని బికారి నా కొడుకు. దానికితోడు కొడుకు పోయి పిచ్చి అయి పోతున్నాడు. కొడుకు జబ్బుకి ఊరంతా అప్పులు చేసేశాడు. ఆ బాధల్ని మరచిపోడానికి వొకటే తాగుడు. ఇప్పుడిప్పుడే కళ్ళు మూసుకుని మూలుగుతూ పడుకున్నాడు.''

గుడిసెన్నగుడి దగ్గరపడుతుందనగా రథం మరింత జోరుగా తోస్తున్నారు. వేగం పుంజుకుంటోంది సంబరం. గబ గబ ముందుకి సాగుతోంది.

అదే సమయంలో జనం మధ్యన – ధన్– మని సోడాబుడ్డి పేలింది.

జనం ఆలోచించే లోపల ప్రక్కసందు లోంచి సోడా బుడ్ల వర్షం. నలువైపుల నుంచి రాళ్ళ వర్షం. సోడా పెంకులు అస్తవ్యస్తంగా ఎగురుతున్నాయి. జనంలో గోల, తొక్కిసలాట. చెల్లా చెదురుగా పరుగెత్తుతున్నారు. ప్రక్క సందులోనుంచి ఒక గుంపు కర్రలతోనూ, సైకిలు చైన్లతోనూ గంగరాజు పార్టీ మీదికి విరుచుకు పడింది. గళ్ళ చొక్కా వాడు సైకిలు చెయిన్‌తో ఛెళ్ళున సాంబడ్ని కొట్టాడు. దెబ్బకి చెట్టులా క్రిందపడిపోయేడు సాంబడు.

''నన్ను ఒంటరిగాణ్ణి చేసి ఇందాకా కొడ్తార్రా? రండ్రా, రక్తం పారాల!'' అని హుంకరించుకుంటూ సైకిల్‌చెయిన్‌ని గిర గిర తిప్పుకుంటూ జనంలో స్వైర విహారం చేస్తున్నాడు గళ్ళచొక్కా. గంగరాజు పార్టీ వాళ్ళు చేతికందిన కర్రల్ని, రాళ్ళని, కిల్లీ కొట్లో నించి సోడా బుడ్లని అందుకుని వెంకు నాయుడు పార్టీ మీద ఎదురు దెబ్బ తీశారు. జనంలో త్రొక్కిసలాట, పిల్లల యేడుపులు. తప్పిపోయిన పిల్లల కోసం తల్లులు పిలుస్తూ పరుగెత్తు తున్నారు. సోడాబుడ్ల ప్రేలుళ్ళు.. రోడ్డు పక్కన తోపుడు బళ్ళ దుకాణాల్నీ, అంగళ్ళనీ తొక్కుకుంటూ తోసుకుంటూ జనం పరుగెత్తు తున్నారు. రథాన్ని విడిచి పెట్టి పూజారులు గెంతేసి పరుగు లంకించుకున్నారు.

''ఎలక్షన్ కార్యాలయానికి నిప్పంటించేరు'' అరిచేడు జనం లోంచి యెంకునాయుడి పార్టీవాడు. ఒక గుంపు ఎలక్షన్ కార్యాలయం వైపు పరుగెత్తుతున్నారు. ఈ సంఘటన క్షణంలో వూరంతా పాకి పోయింది. ఉభయ పార్టీలు కూడలి స్థలాల్లోనూ, బజార్లలోనూ కలియబడుతున్నారు. కొన్ని యిళ్ళు తగలబడుతున్నాయి. పొగతో కూడిన మంటలు నాలికలు చాచుకుంటూ చీకట్లో విస్తరించుకుంటు న్నాయి. గళ్ళ చొక్కా వాడిని యెవరో కత్తితో పొడిచారు.

రక్తం కారుతున్న వాడ్ని కొందరు మోసుకు పోయారు.

రథయాత్ర రణభూమిగా మారింది.

''ధన్, ధన్ , ధన్!''– గాలిలో తుపాకుల కాల్పులు.

పోలీసులు.. పోలీసులు.. ఫైరింగ్! పరుగెత్తుతున్న జనం. మృత్యు భయంతో కేకలు, హాహాకారాలు, పోలీసు వేన్లు అరుచుకుంటూ దూసుకువచ్చాయి.

''డిస్పర్స్! చార్జ్!'' పోలీసు లాఠీలు తలల మీద విరుగుతున్నాయి.

బాష్ప వాయు గోళాలు పేలుతున్నాయి. కళ్ళు మండుతూ చీకట్లు కమ్ముతున్నాయి. పొగకమ్ము కుంటోంది.

అరగంటలో పరిస్థితి అదుపులోకి వచ్చింది. జనం ఇళ్ళలోకి దూరి తలుపులు బిగించుకున్నారు.

గంగరాజునీ, ఎంకునాయుణ్ణి అరెస్టు చేశారు. అనుమానితుల్ని పోలీసు వేన్లో కుక్కేశారు. దెబ్బ లు తిన్న వాళ్ళని అంబులెన్స్ వ్యాన్లో పడేసి పట్నానికి తరలించేరు.

కరెంట్ కట్ చేశారు. కటిక చీకటి.

కర్ఫ్యూ విధించారు.

వీధులన్నీ నిర్మానుష్యం.

గంట క్రితం ఆనందోత్సాహాలతో కళ కళలాడుతున్న ఊరంతా శ్మశాన వాటికలా తయారైంది. ఎటుచూసినా నిశ్శబ్దం. భరింపరాని నిశ్శబ్దం.

కీలకస్థానాల్లో సాయుధ దళాల్ని పెట్టేరు.

రథం నడిరోడ్డు మీద వదిలేసి వుంది. దీపాలు ఆరిపోయి చీకట్లో పాడుపడిపోయిన కొండలా వుంది.

రథాన్ని గుడిసెన్న గుడికి తోసుకుని తీసుకు రావడానికి పోలీసుల బలగం బయలుదేరింది.

''మీరంతా అటు పట్టండి.. ఇటు కొందరు రండి.. మీరు. వెనక నుంచి తొయ్యండి!'' అని పోలీసుల్ని పురమాయిస్తూ ఇన్స్పెక్టరు రథం మీదికి టార్చిలైటు వేశాడు.

క్షణం సేపు పోలీసులంతా నిశ్చేష్టులయ్యారు.

టార్చిలైటు కాంతిలో ఒక మానవ కళేబరం రథానికి వేలాడుతోంది.

ధక్కువాడు రథానికి కొత్త కండువాతో ఉరిపోసుకున్నాడు.

వాడి శవం వికృతంగానూ, భయంకరంగానూ జగన్నాథుని సమక్షంలో ఊగుతోంది. టార్చిలైటుకాంతిలో జగన్నాథ విగ్రహం పేలవంగా, సిగ్గుతో కృంగిపోతున్నట్లు వెల వెల బోతోంది. తన బూతు పాటలతో జనాన్ని, దేవుణ్ణి కైపెక్కించి ఆనంద తరంగాల్లో పల్టీ కొట్టించిన ధక్కువాడు, తనలో ఉవ్వెత్తుగా లేస్తున్న విషాద తరంగాల్ని తట్టుకోలేక, ఆకలి బాధతోనూ రేపటి బ్రతుకు భయంతోనూ, తన నిండు ప్రాణాల్ని కోపంతోనూ, కసితోనూ; దీనబంధువుగా పేరెన్నికగన్న జగన్నాథునికి బలిగా సమర్పించుకున్నాడు.

ధక్కువాడి పీనుగను పోలీసులు రోడ్డు మీద పడేశారు. తరువాత అంబులెన్స్ తీసుకుపోయింది.

రథాన్ని పోలీసులు తోసుకుంటూ గుడిసెన్న గుడికి తెచ్చారు. విగ్రహాల్ని చెరో రెక్కా పట్టుకుని,

పోలీస్ వేన్‌లో నించి గొరగొరా ఈడ్చుకువచ్చి లాకప్‌లో పడేసినట్టు గుడిలో పడేశారు. బయట తాళం వేసి సీల్ చేశారు. గుడి చుట్టూ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేరు.

ఆ రాత్రంతా పోలీసు వేన్లు తిరుగుతున్నాయి. విజిల్స్.. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ దూరంగా కుక్కలు ఆకాశం వైపు మోరలెత్తి దీనంగా ఏడుస్తూ అశుభ సూచకంగా అరుస్తున్నాయి. రక్షక భటుల లోహపద ఘట్టనలు స్పష్టాస్పష్టంగా వినిపిస్తున్నాయి.

చీకటి కొట్టులాంటి గుడిసెన్న గుడిలో జగన్నాథుడు నిస్సహాయంగా బందీగా వున్నాడు. చేతిలోని చక్ర గదాయుధాలు నిష్ప్రయోజనమయ్యాయి. బలరాముని హలం, కురుక్షేత్ర సంగ్రామం లో అగ్నివర్షం కురిపించిన సవ్యసాచి గాండీవం మూగవోయాయి. నరనారాయణుల ధన, మాన, ప్రాణాల రక్షణకి సాయుధులైన పోలీసులు తుపాకులతో గుడిని గస్తీ కాస్తున్నారు.

★ ★ ★

తరువాత కథ:-

అగ్ని సంస్కారంతో పునీతులైనట్లు పోలీసు లాకప్ నుంచి గంగరాజు, వెంకునాయుడు తిరిగి జనాల్లోకి వచ్చేరు.

ప్రతీ సంవత్సరం రంగరంగ వైభోగంగా రథయాత్ర జరుగుతూనే వుంది.

వెంకునాయుడు, గంగరాజు రొటేషన్ పద్ధతిలో ఎమ్. ఎల్. ఏ. లు అవుతూనే వున్నారు.

పాత రథం స్థానే కొత్త రథం వచ్చింది.

ఢక్కువాడి పీనుగుతో మైలపడిపోయిన పాత రథాన్ని ఊరవతల వదిలేశారు.

చుట్టుప్రక్కలవాళ్ళకి అప్పుడప్పుడూ ఊరవతలనించి అర్ధరాత్రివేళ స్పష్టాస్పష్టంగా ఏవో పాటలు, ఏడుపులు వినిపిస్తూంటాయిట! పండు వెన్నెట్లో పాడైపోయిన రథం మీద కూర్చుని ఏడుస్తున్న ఢక్కువాడు కొందరికి కనిపించాడట!! అక్కడి వాళ్ళంతా ఢక్కువాడి ప్రేతాత్మ ఘోషిస్తున్నదంటారు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

★

(ఆంధ్రజ్యోతి, వీక్లీ : దీపావళి 1979)